"దేవుడా! నువ్వు నిజంగా ఉన్నావా? ఉంటే నాతో మాట్లాడు."

వెంటనే ఓ కోకిల మధురంగా కూసింది. కాని ఆ పాపకి దేవుడు తనతో మాట్లాడాడని అర్థం కాలేదు.

"దేవుడా! నువ్వు నిజంగా ఉంటే నాకు కనపడు." కోరిందా పిల్ల.

వెంటనే ఓ నక్షత్రం కాంతి కొద్దిసేపు ప్రకాశవంతమైంది. అయినా ఆ పిల్లకి దేవుడు తనకి కనపడ్డాడని అర్థం కాలేదు.

"దేవుడా! నీ మహత్యం చూపించు." ప్రార్థించిందా పిల్ల.

వందల మైళ్ళ దూరంలోని సముద్రంలోని నీటిని ఎలాంటి వాహనం లేకుండా దట్టమైన మేఘాలు మోసుకు వచ్చాయి. అయినా ఆ పిల్లకి దేవుడి మహత్యం అర్థం కాలేదు.

"దేవుడా! నువ్వంటూ ఉంటే కనీసం నన్ను ముట్టుకో." అడిగింది.

దేవుడు కిందకి దిగివచ్చాడు. రంగు రంగుల ఓ సీతాకోక చిలక వచ్చి ఆ పాప చేతి మీద వాలింది. అయినా దేవుడు తనని ముట్టుకున్నాడని ఆ పాపకి అర్థం కాలేదు. దేవుడు లేడనుకుని వెళ్ళిపోయింది. మనలో అత్యధిక శాతం మంది ఆ పిల్లలాంటి వారమే. దేవుణ్ని కనిపెట్టలేం.

## 138. సబ్బు నీరు

ఒకతను ఓ చేపల గాజు తొట్టిని, మూడు గోల్డ్ ఫిష్‌లని ఓ శనివారం కొని తన ఇంటికి తీసుకువెళ్ళాడు. ఆ తొట్టిని సబ్బుతో బాగా కడిగి దాన్ని నీళ్ళతో నింపి, అందులో మూడు చేపలని వేసాడు. ఈదే ఆ చేపలు ఆ ఇంటికి ఎంతో అందాన్ని ఇచ్చాయి. ఆ రాత్రి అతను చాలాసేపు వాటినే చూస్తూ కూర్చున్నాడు.

మర్నాడు ఉదయం లేచి చూస్తే వాటిలో ఓ చేప మరణించి ఉండటం అతను గమనించాడు. సోమవారం ఉదయం కూడా ఇంకోటి మరణించి నీళ్ళ మీద తేలడం చూసాడు. మంగళవారం ఉదయం మూడోది

కూడా మరణించింది. వెంటనే అతను దాన్ని కొన్న దుకాణానికి వెళ్ళి జరిగింది చెప్పి, అవెలా మరణించాయని నిగ్గదీసాడు.

ఆ దుకాణం యజమాని అతన్ని అనేక ప్రశ్నలు వేసి జరిగింది గ్రహించి చెప్పాడు.

"తొట్టిని సబ్బు నీళ్ళతో కడగకూడదు. అందువల్లే అవి చచ్చిపోయాయి."

ఇదేవిధంగా మనం మన కుటుంబ సభ్యులని, ముఖ్యంగా పిల్లల జీవన విధానాలని శుభ్రం చేయడానికి తిట్లు, విమర్శలు, అవమానకరంగా మాట్లాడటం అనే సబ్బు నీటిని వాడతాం. మనం చేసేది సరైనదే అనుకుంటాం కాని అవి వారి పాలిట శత్రువుగా పనిచేస్తాయి.

## 139. విశ్వాసం

ఓ పర్వతారోహకుడు ఓ సారి ఎవరెస్ట్ శిఖరం ఎక్కుతున్నాడు. సగం దూరం ఎక్కాక ఓ రోజు చీకటి పడసాగింది. ఇంకో ఏభై మీటర్లు ఎక్కితే సమతల ప్రదేశం వస్తుంది కాబట్టి చీకటి పడినా, పైకి వెళ్ళి అక్కడ టెంట్ వేసుకుని విశ్రాంతి తీసుకోవాలనుకుని ఎక్కసాగాడు. అకస్మాత్తుగా అతని చేతులు పట్టు తప్పి కిందకి పడసాగాడు. అదృష్టవశాత్తు అతని నడుం చుట్టూ, కొండలో దిగ కొట్టిన ఓ పరికరానికి కట్టిన తాడు రెండో కొస ఉండటంతో, కొంత దూరం వెళ్ళాక ఆగి గాల్లో వేలాడసాగాడు. అతను దైవ భక్తుడు కాబట్టి వెంటనే దేవుణ్ని తనని కాపాడటానికి సహాయం పంపమని ప్రార్థించసాగాడు.

కొంతసేపటికి అకస్మాత్తుగా గంభీరమైన కంఠం వినిపించింది.

"తాడుని కోసెయ్."

"నువ్వెవరు?" ప్రశ్నించాడు ఆ పర్వతారోహకుడు.

"నేను దేవుణ్ని."